MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 330 | పేజీలు : 8 | గురువారం 19 నవంబర్ 2026 | వెల : 6-00



మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!

- ధరల పెరుగుదలపై కేంద్రంపై ఖర్గే ఫైర్
- కనీస అవసరాలకూ కష్టమే
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు
- ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భారీగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- ఇంధనం, ఆహార ధరల ప్రభావం




భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

- ప్రపంచ పరిణామాలతో మారుతున్న అంతర్జాతీయ వ్యవస్థ
- కొవిడ్, యుద్ధాలతో సరఫరా వ్యవస్థలకు సవాళ్లు
- తక్కువ ఖర్చు కంటే విశ్వసనీయతకే పెద్దపీట
- జపాన్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యం
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల్లో భాగస్వామ్యం

విద్యుత్ కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక



- అంచనా-ప్రణాళిక-అమలు ద్వారా విద్యుత్ డిమాండ్ అందుకోవాలి
- ఎంవోయూ జరిగిన ప్రతి ఎనర్జీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలి
- విద్యుత్ అవసరాలకు ప్రైవేట్ సెక్టార్‌పై ఆధారపడడం తగ్గించాలి
- డిసెంబర్ నాటికి పీఎం సూర్యఘర్ 10 లక్షల లక్ష్యం చేరుకోవాలి
- గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై అత్యంత కఠిన చర్యలు



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్ అంచనా వేసి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించి తక్షణం వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నినో వంటి సమస్యల కారణంగా వర్షాకాలంలో కూడా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని...ఇలాంటి సవాళ్లను ముందుగానే అంచనా వేసుకుని ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ రంగంపై ఆ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ డిమాండ్ 18.23 శాతం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు మార్కెట్‌లో విద్యుత్ ధరలు కూడా తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు సంస్థలపై ఆధారపడడం తగ్గించాలని సీఎం సూచించారు. దీనికోసం ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వ ప్రాజెక్టులు గ్రౌండ్ చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల్లో హామీ - మిగతా2లో



మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

- మసీదులో దాక్కున్నా వదలని భద్రతా బలగాలు..
- లొంగిపోవాలని కోరినా నిరాకరణ
- రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ఉగ్రవాది కథకు తెర..
- ఆపరేషన్‌ను అభినందించిన అమిత్ షా

5లో

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

- 23 నుంచి 112కు పెరగనున్న ప్యాకేజీలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని చికిత్సలు
- 89 కొత్త వైద్య సేవలకు ప్రతిపాదన
- చిన్నచిన్న వ్యాధులకు స్థానికంగానే వైద్యం
- హిస్టరెక్టమీ నుంచి గ్లకోమా వరకు చికిత్సలు
- ఆస్పత్రుల అభివృద్ధికి అదనపు నిధులు

5





ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు


- నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక
- రేపు 28 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక
- ఎన్నికైన రోజు నుంచే ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం
- ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ

2

- ఎంపీటీసీలు, జడ్పీటీసీల ద్వారా పరోక్ష ఎన్నికలు

దిశ మార్చుకుంటూ.. దడపుట్టిస్తున్న ఆక్వాన్

- గంటకు 8 కిలోమీటర్ల వేగంతోనే కదలిక
- దిశ మార్చుకుంటూ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా సరిహద్దు వైపు తుపాను
- నెల్లూరు--తుని నుంచి నరసాపురం-పూరీకి.. తీరం దాటే ప్రాంతం
- తీరం చేరేసరికి బలహీనపడే అవకాశం
- 20వ తేదీ మధ్యాహ్నానికి తీరం దాటే సూచన
- ఇప్పటికే ఉత్తరాంధ్రను కమ్ముకున్న మేఘాలు



అమరావతి, మహానగర్

ఆక్వాన్ తీవ్ర తుపాను బంగాళాఖాతంలో నెమ్మదిగా కదులుతూ గుబులు రేపుతోంది. తక్కువ వేగంతో కదులుతూ దిశ మార్చుకుని ఉత్తరం వైపు మళ్లడంతో అది తీరం దాటే ప్రాంతంపై అంచనాలు మారాయి. తొలుత దక్షిణ కోస్తాను తాకుతుందనుకున్న తుపాను ఇప్పుడు ఉత్తరాంధ్ర--దక్షిణ ఒడిశా వైపు కదులుతోంది. నెల్లూరు--తుని మధ్య తీరం దాటుతుందని తొలుత అంచనా వేయగా మచిలీపట్నం- - మిగతా2లో

మత్స్యకార సోదరుల మాటలు కలచివేశాయి



- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్
- అగ్ని ప్రమాదుం 300 కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీసింది
- వలలు, వేట సామగ్రి కాలిపోయి రూ.5 కోట్ల నష్టం జరిగింది
- వేటకు వెళ్తే గాని ఇల్లు గడవని కుటుంబాలవి..
- చంద్రబాబూ.. ఆ కుటుంబాలను ఆదుకోండి
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లించాలి
- లేదంటే మా ప్రభుత్వం వచ్చాక ఆదుకుంటాం

అమరావతి, మహానగర్

ప్రకాశం జిల్లా కె.పల్లెపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.5 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని.. వలలు, వేట సామగ్రి కళ్లముందే కాలిపోయాయంటూ మత్స్యకారులు చెప్పిన మాటలు తనను కలిచివేశాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనతో 300 కుటుంబాల జీవనోపాధి దెబ్బతిందని.. వేటకు వెళ్తే గాని ఇల్లు గడవని ఆ కుటుంబాలను ఆదుకోవాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను పలువురు మత్స్యకారులు కలిశారు. అగ్నిప్రమాదం వల్ల భారీగా నష్టపోయామంటూ తమ సమస్యలు చెప్పుకున్నారు. వారికి వైఎస్ జగన్ ధైర్యం చెప్పి.. భరోసా కల్పించారు. దీనిపై వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంలో - మిగతా2లో

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ

చిప్ తయారీలో గ్లోబల్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం!

సిలికాన్ ఫ్యాబ్‌లకు 80 శాతం పెట్టుబడి రాయితీ

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో ప్రత్యేక పార్క్

2



దిశ మార్చుకుంటూ.. దడపుట్టిస్తున్న ఆక్వాన్

-మొదటిపేజీ తరువాయి


పూరీ మధ్య తీరం దాటుతుందని బుధవారం మధ్యాహ్నం వాతావరణ శాఖ తెలిపింది. సాయంత్రానికి నరసాపురం--పూరీ మధ్య తీరం దాటుతుందని పేర్కొంది.

తుపాను గమనాన్ని బట్టి శ్రీకాకుళం--దక్షిణ ఒడిశా తీరాల మధ్యే తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఎనిమిది కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఆక్వాన్ బుధవారం నరసాపురానికి 540 కిలోమీటర్లు, కళింగపట్నానికి 600 కిలోమీటర్లు, చెన్నైకి 570 కి.మీ.. పూరీకి 750 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సముద్రంపైనే ఎక్కువసేపు ఉండటంతో గురువారం తుపాను అక్కడే ఎక్కువ బలపడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తీరానికి చేరే సమయానికి బాగా బలహీనపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అత్యంత తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని మొదట వేసిన అంచనాలను సవరించి తీవ్ర తుపానుగానే తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయానికి ఇంకా బలహీనపడి సాధారణ తుపాను స్థాయికి దిగినా ఆశ్చర్యంలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు కుండపోత వర్షాలు..

ఇది శుక్రవారం మధ్యాహ్నానికి తీరం దాటే అవకాశం ఉంది. అయితే ఈలోపే దాని ప్రభావంతో ఏర్పడిన మేఘాలు విశాఖ నుంచి కటక్ వరకు తీరప్రాంతంలో విస్తరించాయి. కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు తీరప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర, యానాం ప్రాంతాలకు రెడ్ అలెర్ట్ జారీచేశారు.

ఉపరితల వాతావరణంలో తుపానును ముందుకు తోసే గాలులు బలహీనపడడంతో అది నెమ్మదిగా కదులుతోంది. అదే సమయంలో ఉత్తరాది నుంచి విస్తరించిన ద్రోణి తుపానును ఉత్తరదిశ వైపు నెడుతోంది. ఫలితంగా పడమర వైపు రావాల్సిన తుపాను దిశ మార్చుకుని ఉత్తరం వైపు మళ్లింది. ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో తుపాను ఇంకా



ఉత్తరానికి కదులుతూ ఏపీ--ఒడిశా సరిహద్దు ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

100 కిలోమీటర్ల వేగంతో గాలులు..

బుధవారం అర్ధరాత్రి నుంచి తుపాను ప్రభావం కనిపించనుంది. భారీ వర్షాలతోపాటు గంటకు 100--110 కిలోమీటర్లు, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. తుపాను బలహీనపడినా వర్షాల తీవ్రత ఉండనుంది. కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు తీరానికి ఎదురుగా సముద్రంలో తుపాను వర్ష కేంద్రం కేంద్రీకృతమై ఉంది. తీరప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ జిల్లాలు, యానాంలో అక్కడక్కడ అత్యంత భారీవర్షాలు కురుస్తాయి. పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు పడతాయి.

ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోను భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను తీరం దాటే శుక్రవారం ఉత్తరాంధ్రలో పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉండనుంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయి. అల్లూరి, కోనసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీవర్షాలు పడతాయి. గురు, శుక్రవారాల్లో కోస్తా అంతటా గంటకు 90--100 కిలోమీటర్లు, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయి. శనివారం కూడా ఉత్తరాంధ్రలో భారీవర్షాలు కొనసాగుతాయి. రాయలసీమపై తుపాను ప్రభావం పెద్దగా ఉండదని వాతావరణ శాఖ తెలిపింది.

ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు

అమరావతి


ఆంధ్రప్రదేశ్‌లో మండల, జిల్లా పరిషత్‌లకు నూతన పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఎంపీపీలు, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోనుండగా, శుక్రవారం 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను జడ్పీటీసీలు ఎన్నుకోనున్నారు. పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలతో ఎన్నికైన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 9 వేలకుపైగా ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ జరిగింది. తుపాను ప్రభావం, రీపోలింగ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో నవంబర్ 6న కూడా ఓటింగ్ నిర్వహించారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. తాజాగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు తేదీలను ఖరారు చేస్తూ ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ

గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల కోసం ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన చేపడతారు. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే సంబంధిత పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. పోటీ లేకపోతే మధ్యాహ్నం 12 గంటలకు ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించి, అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు.

రేపు జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక

శుక్రవారం రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్



చైర్మన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. సంబంధిత జడ్పీటీసీ సభ్యులు పరోక్ష పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లతో పాటు వైస్ పదవులకు ఎన్నికైన వారి పదవీకాలం కూడా ఎన్నికైన రోజు నుంచే లెక్కించనున్నారు.

కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు

ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం మతపరమైన మైనారిటీ వర్గాలకు లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ మతాలకు చెందినవారు మతపరమైన మైనారిటీలుగా, తెలుగు కాకుండా ఇతర మాతృభాష కలిగినవారు భాషాపరమైన మైనారిటీలుగా పరిగణించబడతారు.

పార్టీ విప్ తప్పనిసరి

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసే విప్ నిబంధనలు వర్తిస్తాయి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ వర్తించదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సంబంధిత పరిషత్‌లలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు హక్కు ఉండదు.

ఎన్నికల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, వారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చింది.

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

ఈ విధానం కింద సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ అందిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యధిక ప్రోత్సాహకమని ఆయన తెలిపారు. డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని వెల్లడించారు.

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో పార్క్

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఒకే ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో 5 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక సెమీకండక్టర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రవాణా సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇండియా సెమీకండక్టర్ మిషన్-2కు అనుగుణంగా



కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా రాష్ట్ర సెమీకండక్టర్ విధానాన్ని సవరించినట్లు లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంతో పాటు దేశీయంగా చిప్ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.

యువతకు ప్రత్యేక శిక్షణ.. నెలకు రూ.10 వేలు

సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. యువతకు ఈ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందే ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

దేశీయ చిప్ తయారీకి ఏపీ వేదిక

భారత్ తన అవసరాలకు సంబంధించిన చిప్‌లను దేశంలోనే తయారు చేసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చిప్ తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి వంటి విభాగాలను ఒకే పారిశ్రామిక వ్యవస్థగా అనుసంధానించి రాష్ట్రాన్ని అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

విద్యుత్ కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చామని...దానికి కట్టుబడి ఉన్నామని గుర్తు చేసిన సీఎం... విద్యుత్ కొనుగోలు భారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి, సరఫరా వంటి అంశాల్లో ఏఐ వంటి టెక్నాలజీని ఉపయోగించి సామర్థ్యం పెంచుకోవాలన్నారు. అప్పుడు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం కూడా ఉండదని సీఎం అన్నారు.

చోరీలపై కఠిన చర్యలు

విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చోరీల అంశం కూడా సమీక్షలో చర్చకు వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున చోరీకి గురవుతున్నాయని అధికారులు తెలిపారు. రాగి తీగలు కోసం ట్రాన్స్ ఫార్మర్లు దొంగిలిస్తున్నారని అధికారులు తెలుపగా... ఇటువంటి చర్యలకు పాల్పడుతోన్న వారిపట్ల అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అదేశించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు విద్యుత్ సరఫరాలో సమస్యలకు కారణం అవుతున్న వారిని వదిలిపెట్టవద్దని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో దర్యాప్తునకు పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని... చోరీలకు పాల్పడే వారికి గట్టి గుణపాఠం చెప్పాలని సీఎం అన్నారు.

గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వేగవంతం కావాలి

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని భారీగా పెంచే దిశగా చేపట్టిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూన్ 2024 నుంచి విద్యుత్ రంగంలో 103 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో విద్యుత్ రంగానికి సంబంధించి రూ.2.56 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు ఒప్పందాలు కార్యరూపం దాల్చడంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఎంవోయూలు చేసుకున్న ప్రతి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద రాష్ట్రంలో రూ.21,838 కోట్లతో భారీ విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరగా టెండర్లు పిలిచి, రెండేళ్లలోగా కార్యరూపంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ లక్ష్యం

రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. పోలవరం పరిసర ప్రాంతాల్లో 27 పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై మరింత పరిశోధన, అధ్యయనం జరగాలని సీఎం సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉన్న మన రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువెళ్లాలని సీఎం నిర్దేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో పాటు... సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్లపై సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాల్సి ఉందన్నారు. సోలార్ రూఫ్ టాప్‌లో నాయుడుపేట, మాచర్ల, నరసరావుపేట డివిజన్లు ముందున్నాయని అధికారులు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు 7.42 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తి చేసినట్టు అధికారులు పేర్కొనగా, 10 లక్షల లక్ష్యాన్ని డిసెంబర్ నాటికి చేరుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ పథకం కింద 224 ప్రాంతాల్లో 1,162 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల పనుల్లో పురోగతి ఉందని అధికారులు వివరించారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ 100 శాతం పూర్తి చేశామని, అలాగే సివిల్ పనులు 91 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

మత్స్యకార సోదరుల మాటలు కలచివేశాయి

-మొదటిపేజీ తరువాయి

ఈ రోజు తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారుల వలలు, వేట సామగ్రి కాలిపోయి రూ.5 కోట్ల మేర ఆస్తినష్టం జరిగి 300 మత్స్యకార కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీసింది. వేటకు పెట్టుకున్న వలలన్నీ కళ్లముందే కాలిపోయాయని ఈ రోజు నన్ను కలిసిన మత్స్యకార సోదరులు చెప్పారు. వారి మాటలు నన్ను కలచివేశాయి.

పూర్తి నష్టపరిహారం చెల్లించాలి..

చంద్రబాబూ.. రోజూ వేటకు వెళ్తేగాని ఇల్లు గడవని కుటుంబాలివి. నష్టాన్ని వెంటనే అంచనా వేసి, బాధిత కుటుంబాలన్నింటికీ పూర్తి నష్టపరిహారం చెల్లించాలని మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఈ సందర్భంగా మత్స్యకార సోదరులకు హామీ ఇస్తున్నా. ఈ ప్రభుత్వం మిమ్మల్ని ఆదుకోకపోతే.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకుంటాం.. అధైర్యపడకండి' అని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు.

తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్

వైకుంఠ ద్వార దర్శనాలు ఎప్పటి నుంచంటే?

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. పరమ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ 10 రోజుల వ్యవధిలో మొత్తం 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే అత్యధికంగా 92 శాతం ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలకు సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తొలి రెండు రోజులు ఎలాంటి సర్వదర్శనం ఉండదని, ఆ తర్వాతి 8 రోజుల పాటు భక్తులకు సర్వదర్శనం అమలు చేస్తామని వివరించారు. భక్తుల సౌకర్యార్థం అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డు సమీపంలోని టీటీడీ స్థలంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో అత్యాధునిక యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్ల తయారీ, పర్యవేక్షణ కోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించింది. అలాగే శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధి, ఇంటర్‌లాకింగ్ సిమెంట్ బ్లాక్‌ల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లు మంజూరు చేశారు. అలిపిరి నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వరకు రోడ్డుపై నడిచివచ్చే భక్తుల కోసం ఐఐటీ నిపుణుల సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు అందించే ప్రోత్సాహక బహుమానాన్ని ఖరారు చేశారు. శాశ్వత ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.8,289 చొప్పున చెల్లించనున్నారు. 2007 సీనియారిటీ జాబితా ప్రకారం ఫేజ్-3 పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ఇంటి ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అర్హుల పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పాదిరేడు లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి గతంలో కేటాయించిన రూ.230 కోట్ల ధ్రువీకరణకు మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారంతో పాటు, భవిష్యత్తులో అర్హులైన ఉద్యోగుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక ప్రయోజనం దక్కేలా నూతన సంక్షేమ విధానాన్ని తీసుకురానున్నారు. పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, పాత బకాయిల చెల్లింపులకు గాను స్విమ్స్ ఆసుపత్రికి అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటును కేటాయించారు. ఎస్వీ

ధూమపానంతో సీవోపీడీ ముప్పు

విజయవాడ, మహానగర్

ధూమపానం వల్ల ఊపిరితిత్తులకు తీవ్ర నష్టం వాటిల్లి క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ) వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో 27,319 మందిపై నిర్వహించిన 23 అధ్యయనాల విశ్లేషణలో ధూమపానం చేసేవారిలో 37 శాతం మందికి ఈ వ్యాధి ఉన్నట్లు వెల్లడైంది. అమెరికా సీడీసీ నివేదిక ప్రకారం సీవోపీడీ మరణాల్లో ప్రతి పది మందిలో ఎనిమిది మంది సిగరెట్ ధూమపానం కారణంగానే మరణిస్తున్నారు. ఈ వ్యాధి వల్ల నిరంతర దగ్గు, కఫం, ఆయాసం, ఊపిరితిత్తుల పనితీరు తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి. వ్యాధిని తొలిదశలో గుర్తించేందుకు స్పైరోమెట్రీ పరీక్షలు, సకాలంలో చికిత్స అవసరమని ఢిల్లీ వైద్యులు డాక్టర్ పవన్ గుప్తా, డాక్టర్ చంద్రమణి పంజాబీ సూచించారు. ధూమపానం మానేయడానికి కౌన్సెలింగ్, వైద్య సహాయం తీసుకోవాలని తెలిపారు. గృహ వాయు కాలుష్యం, దుమ్ము, రసాయన పొగలు కూడా సీవోపీడీకు కారణమవుతాయని పేర్కొన్నారు. ధూమపాన విరమణే ఉత్తమ మార్గమని స్పష్టం చేశారు.

డిసెంబర్ 19న హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్స్-2026



హైదరాబాద్, మహానగర్

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి గౌరవించేందుకు ఎలైట్ లీడర్‌షిప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్--2026 నిర్వహించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు చైతన్య జంగా, వైస్ ప్రెసిడెంట్ పాకలపాటి విజయవర్మ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 19న బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కళలు, సంస్కృతి, సినిమా, వ్యాపారం, విద్య, వైద్యం, సామాజిక సేవ, మీడియా, సాంకేతికత, మహిళా సాధికారత తదితర రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రతిభావంతులను ఎంపిక చేసి సత్కరించనున్నట్లు తెలిపారు. వారి విజయాలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు, మరింత మందికి స్ఫూర్తినివ్వడమే ఈ అవార్డుల లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభావంతులకు గుర్తింపు తెచ్చే వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమ వివరాలకు 98663 33787, 98486 69996 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా కంట్రీ క్లబ్ చైర్మన్ రాజీవ్ రెడ్డి అవార్డుల కార్యక్రమానికి సంబంధించిన ఫ్లయర్‌ను ఆవిష్కరించి నిర్వాహకులను అభినందించారు. సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ ప్రతిభావంతులకు పురస్కారాలు అందించడం అభినందనీయమని, ఈ కార్యక్రమానికి కంట్రీ క్లబ్ భాగస్వామ్య వేదికగా వ్యవహరిస్తుందని తెలిపారు. సమావేశంలో సినీ నటీమణులు, మోడల్స్ మేఘ బెనర్జీ, ప్రతిమ మౌర్య, భావన శర్మ, ఫిట్‌నెస్ గురు అను ప్రసాద్, మిథాని ఈశ్వర్, వ్యాపారవేత్తలు మహేష్ కుమార్, కోడె చైతన్య, రామిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. డిసెంబర్ 19న జరిగే వేడుకకు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరుకానుండగా, సినీ నటి లయ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

చల్లపల్లి ఎంపీపీగా విజయలక్ష్మి పేరు ఖరారు

అవనిగడ్డ, మహానగర్



నియోజకవర్గ పరిధిలోని చల్లపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలిగా మట్టా కనక విజయలక్ష్మిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు. బుధవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ సభ్యులు మట్టా నాంచారయ్య, లక్ష్మీపురం-3 సెగ్మెంట్ ఎంపీటీసీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రామానగరం గ్రామానికి చెందిన వంద కుటుంబాల వారితో కలిసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయానికి తరలివచ్చారు. విజయలక్ష్మి, నాంచారయ్య దంపతులు తమ అభిమానులతో కలిసి జై జనసేన నినాదాలు మారుమోగించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి, నాంచారయ్య దంపతుల ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ జనసేన కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన ఎంపీటీసీ సభ్యులు బొందలపాటి శ్యామసుందరి, అద్దేపల్లి జయలక్ష్మి సాయికుమారి, కాగిత రమేష్, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ నాయకులు మడమల రంజిత్, ఉరిమి మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసిన టీడీపీ నేత అరవింద్

చల్లపల్లి, మహానగర్



మండలానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు, మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు) తనయుడు యార్లగడ్డ అరవింద్ బుధవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు మండలి వెంకట్రామ్‌ను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.

డిసెంబర్ 12న ఢిల్లీలో 'చలో ఢిల్లీ-కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పిలుపు



విజయవాడ, మహానగర్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ--కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'లో ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్‌జీజీఓ హోమ్‌లో ర్యాలీ పోస్టర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెన్షనర్ల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే ర్యాలీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. దేశవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి నూతన పెన్షన్ విధానాలను రద్దు చేయాలని, ఈపీఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్‌తోపాటు నిర్వచిత ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ నిలిపివేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, పెన్షనర్లు, వారి కుటుంబాలకు సమగ్ర ఆరోగ్య బీమా, నగదు రహిత వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలిపివేసి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, ఆర్టీఈ చట్టం అమలుకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు తప్పనిసరి చేసిన టెట్ నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 310, 311(2)(ఖ), (ఎ), (ఎ)లను, ఈఎస్ఎంఏ చట్టాన్ని రద్దు చేయాలని, పెండింగ్ డీఏ/డీఆర్ బకాయిలతోపాటు కోవిడ్ సమయంలో నిలిపివేసిన 18 నెలల డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించే పెన్షన్ వాలిడేషన్ చట్టం--2025ను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్లు ఉద్యోగుల సమస్యలకే పరిమితం కాకుండా కార్మికుల హక్కులు, సామాజిక భద్రత, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణకు సంబంధించినవని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 12న జరిగే ర్యాలీతోపాటు బహిరంగ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ముజీఫర్ అహ్మద్, ఏఐఎస్‌జీఈఎఫ్ ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం. రాజలక్ష్మి, ఎన్ఈసీ సభ్యురాలు వి. శాంతిశ్రీ, ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. భారతి ప్రసాద్, బి. జానకి, వి. సుబ్బారెడ్డి, ఎల్. రజనీష్ బాబు, ఎం. సరస్వతి, మహిళా విభాగం జాయింట్ కన్వీనర్ పి. సురేఖ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు సి.హెచ్. నాగభూషణం, ఇతర నాయకులు, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగర శాఖ ప్రతినిధులు, ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆళ్ల చెల్లారావు భేటీ



విజయవాడ, మహానగర్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఆళ్ల చెల్లారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

కో-ఆప్షన్ సభ్యులుగా గౌస్, ఉస్మాన్, బషీర్



చల్లపల్లి, మహానగర్

నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులను ప్రకటించారు. అవనిగడ్డ మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుగా షేక్ గౌస్ (కాటమ), చల్లపల్లి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుగా ఉస్మాన్ షరీఫ్, కోడూరు మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుగా బషీర్ మొహిద్దీన్ లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ వారిని అభినందించారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటాలి

చైత్ర దీపికను అభినందించిన పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



విజయవాడ, మహానగర్

స్కేటింగ్‌లో వరుస విజయాలతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన పెదిరెడ్ల చైత్ర దీపికను పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అభినందించారు. ఈ నెల కాకినాడలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా తరపున పాల్గొన్న చైత్ర దీపిక క్వాడ్ స్కేటింగ్‌లో రజతం, సోలో డ్యాన్స్‌లో కాంస్య పతకం సాధించి 64వ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత పొందింది. తాను సాధించిన పతకాలతో శ్రీధర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఇదే సందర్భంగా రాష్ట్రస్థాయి సోలో డ్యాన్స్, ఫ్రీస్టైల్, ఫిగర్ స్కేటింగ్ పోటీల్లో మూడు కాంస్య పతకాలు సాధించిన కె. దియాశ్రీని కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో చైత్ర దీపిక మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా నారాయణ విద్యార్థుల విజ్ఞాన యాత్ర





విశాఖపట్నం, మహానగర్

సంప్రదాయ కళలు, గ్రామీణ జీవన విధానాలు, పర్యావరణహిత పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన కల్పించే లక్ష్యంతో అక్కయ్యపాలెం నారాయణ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థులు బుధవారం పెదగాడిలోని సంకల్ప ఆర్ట్ విలేజ్‌ను సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా విద్యార్థులు చేనేత వస్త్రాల తయారీ, సేంద్రియ ఉత్పత్తులు, నూనె మిల్లు, ఉద్యానవనం, చెక్క బొమ్మల తయారీ తదితర అంశాలను ఉత్సాహంగా పరిశీలించారు. తరగతి గది పాఠాలకు అనుబంధంగా క్షేత్రస్థాయిలో అనుభవపూర్వక జ్ఞానాన్ని పొందే అవకాశం ఈ యాత్ర ద్వారా విద్యార్థులకు లభించింది.

తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల పరిశీలన పూర్తి

మొత్తం 3,156 నామినేషన్లు చెల్లుబాటు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన అనంతరం చెల్లుబాటైన అభ్యర్థుల వివరాలను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. జిల్లాలోని విజయవాడ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఐదు మండలాల్లో 73 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 856 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం మొత్తం 435 మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు, 2,721 మంది వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటైనట్లు ఆయన వివరించారు. ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మహానగర్

దడ పుట్టిస్తున్న ద్రవ్యోల్బణం

ధరల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దేశంలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మరోసారి పెరిగింది.అక్టోబరులో వార్షిక ప్రాతిపదికన టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది.సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే అక్టోబరులో ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. సర్వేలో ఆర్థిక నిపుణులు అంచనా వేసిన 12.1 శాతాన్ని కూడా మించింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, చమురు ధరలు పెరగడం ఈ పరిణామానికి కారణమైంది. అక్టోబరులో టోకు ఆహార ధరలు 8.58 శాతం పెరిగాయి.అయితే సెప్టెంబరులో ఈ పెరుగుదల 8.66 శాతంగా నమోదైంది. అంటే ఆహార ధరల పెరుగుదల రేటులో స్వల్ప తగ్గుదల కనిపించింది.మరోవైపు తయారీ రంగ ఉత్పత్తుల ధరలు అక్టోబరులో 9.54 శాతం పెరిగాయి.సెప్టెంబరులో ఈ పెరుగుదల 9.76 శాతంగా ఉంది. దీంతో తయారీ ఉత్పత్తుల ధరల పెరుగుదలలోనూ కొంత తగ్గుదల నమోదైంది.ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల మాత్రం మరింత వేగంగా కొనసాగింది.సెప్టెంబరులో 25.85 శాతంగా ఉన్న ఈ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబరులో 32.84 శాతానికి చేరింది.అయితే పెట్రోలియం, సహజ వాయువు ధరల పెరుగుదల మాత్రం గణనీయంగా తగ్గింది.సెప్టెంబరులో 57.32 శాతంగా ఉన్న ఈ ధరల పెరుగుదల అక్టోబరులో 7.80 శాతానికి పరిమితమైంది.మొత్తంగా ఆహార పదార్థాలు, ఇంధనం, చమురు ధరల్లో చోటుచేసుకున్న మార్పులు టోకు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపాయి.జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల ప్రకారం, దేశంలో 7 శాతానికి మించి ద్రవ్యోల్బణం నమోదైన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. గత పది నెలలుగా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే ఎక్కువగా కొనసాగుతోంది. ఇది సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తిపై ఒత్తిడి తెస్తోంది.ఈ ఏడాది జనవరిలో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా ఉండగా, నెలవారీగా పెరుగుతూ అక్టోబర్‌లో 7.26 శాతానికి చేరుకుంది.ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, మేలో 6.15, జూన్‌లో 6.36 శాతంగా నమోదైంది. జూలై, ఆగస్టులో కాస్త తగ్గినప్పటికీ సెప్టెంబర్ నుంచి మళ్లీ పెరుగుదల మొదలైంది. ఇప్పుడు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.05 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా ఉంది. జాతీయ గ్రామీణ సగటు 6.63 శాతంతో పోలిస్తే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 1.4 శాతం పాయింట్లు అధికం.దీంతో గ్రామీణ కుటుంబాలపై నిత్యావసరాల ధరల భారం మరింత ఎక్కువగా పడుతోంది.ఆహార ధరల పెరుగుదలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతం ఉండగా అక్టోబర్‌లో 8.94 శాతానికి పెరిగింది. ఉల్లి ధరలు 116 శాతం పైగా పెరగడం, వెల్లుల్లి, అల్లం, నిమ్మకాయలు, బియ్యం వంటి వస్తువుల ధరలు ఎగబాకడం సామాన్యుల ఇంటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.అక్టోబర్‌లో రాష్ట్రంలో వర్షపాతం భారీగా తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది కూరగాయలు, పండ్లు, ధాన్యాల ధరలపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చు.ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి, నిమ్న మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనె, పాలు వంటి అవసరాలకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి రావడంతో ఇతర అవసరాలు వెనక్కి పోతున్నాయి.ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ, సరఫరా గొలుసులోని సమస్యలు, వాతావరణ ప్రభావం కొనసాగితే ముందున్న నెలల్లో కూడా ఒత్తిడి ఉండే అవకాశం ఉంది.మొత్తంగా చూస్తే తెలంగాణలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావాలంటే ఆహార ఉత్పత్తి పెంపు, సరఫరా మెరుగుదల, అవసరమైన చోట సబ్సిడీలు లేదా మార్కెట్ జోక్యం అవసరం. సామాన్యులు కూడా ధరలు తక్కువగా ఉన్న సీజనల్ కూరగాయలు, స్థానిక ఉత్పత్తులు వాడటం ద్వారా కొంతవరకు ఖర్చులను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితి సామాన్యుడి జేబుపై నిజంగా భారం పెడుతోంది.ద్రవ్యోల్బణం కట్టడికి వచ్చే ద్రవ్య సమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ పెంచడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఇదే జరిగితే నిర్మాణ, ఆటో రంగాలకు పెద్ద దెబ్బేనన్న విశ్లేషణలుంటున్నాయి. ఇప్పటికే ఇండ్ల విక్రయాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఈ క్రమంలో వడ్డీరేట్ల పెంపు గృహ రుణాలపై ప్రభావం చూపనున్నది. ఇప్పటికే లోన్లపై ఇండ్లు కొన్నవారికి ఈఎంఐలు భారంగా మారుతాయని, కొనాలనుకుంటున్నవారు తమ నిర్ణయాలను వాయిదా వేసుకోవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అలాగే వాహన, వ్యక్తిగత రుణాలూ ప్రియమవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ, ఆటో వాటి అనుబంధ రంగాలు మందగమనంలోకి జారుకుంటే.. అది దేశ ఆర్థిక వృద్ధిరేటునే కుంగదీస్తుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలే ఎల్ నినో దెబ్బకు అన్ని రంగాలు ఢీలాపడ్డ తరుణంలో ద్రవ్యోల్బణం పేరిట ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే మరిన్ని రంగాలు నష్టపోతాయని సూచిస్తున్నారు.ఇంధనం, ఆహార ధరల షాక్‌లు రెండూ ఒకేసారి వచ్చినప్పుడు వాటి ప్రభావం మరింత పెద్దదిగా ఉండవచ్చు. అందుకే పరిస్థితుల్ని చక్కదిద్దడానికి ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నది. వచ్చే నెల ద్రవ్య సమీక్షలో రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలు లేకపోలేదు.ఎల్ నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో దేశీయ వ్యవసాయ రంగం దెబ్బ తింటున్నది. పంటల సాగు, దిగుబడి రెండూ పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటంతో వినియోగ సామర్థ్యం తగ్గిపోతున్నది. పెరుగుతున్న వడ్డీరేట్లతో రుణ లభ్యత ఖరీదెక్కుతున్నది.


తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరి వార్



చెన్నై : కర్ణాటకలోని కావేరీ నదిపై మేకదాటు దగ్గర భారీ జలాశయం నిర్మించాలని అక్కడి ప్రభుత్వం ప్రతిపాదించింది. బెంగళూరుతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. నీటిని నిల్వ చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేయాలని కర్ణాటక భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 67 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని ప్రతిపాదించింది. తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీలు వినియోగించాలని ప్రణాళికలో పేర్కొంది. సుమారు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా లక్ష్యంగా పెట్టుకుంది. అయితే తమిళనాడు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జలాశయం నిర్మిస్తే తమకు వచ్చే కావేరీ నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా డెల్టా ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు దెబ్బతింటాయని వాదిస్తోంది. కర్ణాటకకు నీటి నిల్వ అవసరం. తమిళనాడుకు నీటి ప్రవాహంపై భరోసా కావాలి. ఈ రెండు వాదనల మధ్యే మేకదాటు వివాదం కొనసాగుతోంది.కావేరీ నదిపై ఎగువ ప్రాంతంలో కర్ణాటక జలాశయం నిర్మిస్తే నీటి నిల్వ, విడుదలపై ఆ రాష్ట్రానికి మరింత నియంత్రణ లభిస్తుందని తమిళనాడు భావిస్తోంది. దీనివల్ల తమకు కేటాయించిన నీటి వాటా అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చని వాదిస్తోంది. కావేరీ డెల్టాలో వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంత రైతులు నదీ జలాలపైనే ఆధారపడుతున్నారు. నీటి విడుదలలో ఆలస్యం జరిగినా పంటలపై ప్రభావం పడుతుంది. అందుకే మేకదాటు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తమిళనాడు పట్టుబడుతోంది.మరోవైపు కర్ణాటక తన ప్రతిపాదనను సమర్థిస్తోంది. బెంగళూరు నగరం వేగంగా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని చెబుతోంది. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా జలాశయం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చని అంటోంది. తమిళనాడుకు కేటాయించిన 177.25 టీఎంసీల నీటిని విడుదల చేసే బాధ్యతను తాము పాటిస్తామని చెబుతోంది. జలాశయం వల్ల తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని కర్ణాటక వాదిస్తోంది. అయితే ఈ వాదనలను తమిళనాడు అంగీకరించడం లేదు. నీటి వాటా కేటాయింపులు ఉన్నప్పటికీ.. అదనపు జలాశయం వల్ల భవిష్యత్తులో తమకు ఇబ్బందులు రావచ్చని ఆందోళన చెందుతోంది.మేకదాటు విషయంలో తమిళనాడు అభ్యంతరాలు కొనసాగుతున్న సమయంలో విజయ్ కర్ణాటక సీఎంతో ఒకే వేదికపై కనిపించడం వివాదానికి కారణమైంది. సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇద్దరూ కలుసుకున్నారు. ఈ భేటీలో కావేరీ జలాల అంశాన్ని విజయ్ ప్రస్తావించారా లేదా అన్నది కూడా చర్చకు వచ్చింది. రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో రాజకీయ మర్యాదలకే ప్రాధాన్యం ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి.

విజయ్ ఢిల్లీ పర్యటనపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, ముందుగా మేకదాటు ప్రాజెక్టుపై తన వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేయాల్సిందని బీజేపీ నేతలు అంటున్నారు. కర్ణాటక సీఎం ప్రాజెక్టు నిర్మాణంపై పట్టుదలగా ఉన్న సమయంలో విజయ్ ఆయనతో స్నేహపూర్వకంగా కనిపించడం తప్పు సంకేతాలు ఇస్తోందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర హక్కుల విషయంలో రాజకీయ రాజీలు ఉండకూడదని బీజేపీ వాదిస్తోంది. ఈ ఘటనను విజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపయోగించుకుంటోంది.బీజేపీతో పాటు తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షాలు కూడా విజయ్‌పై విమర్శలు పెంచాయి. డీఎంకే నేతలు విజయ్ మేకదాటు సమస్యను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి ఉమ్మడి వైఖరిని ప్రకటించాలని మాజీ సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. మేకదాటు విషయంలో రాజకీయాలకు అతీతంగా తమిళనాడు ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే కూడా విజయ్ తీరును తప్పుబట్టింది. కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడటం వల్లే కర్ణాటక విషయంలో గట్టిగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించింది. రాష్ట్ర హక్కుల కంటే ముఖ్యమంత్రి పదవికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిందిమరోవైపు విజయ్ కూడా ఈ వివాదంపై స్పందించారు. కావేరీ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో కర్ణాటకకు వెళ్లాలని భావించినట్లు తెలిపారు. తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం అవమానాలు ఎదురైనా భరించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. కావేరీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మేకదాటు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. పొరుగు రాష్ట్రంతో చర్చలు జరపడం తప్పు కాదని, సమస్యకు పరిష్కారం కనుగొనడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వివాదం కేవలం వేదిక పంచుకున్న అంశం నుంచి, విజయ్ రాజకీయ వైఖరి చుట్టూ తిరిగే చర్చగా మారింది.విజయ్ తీరును కాంగ్రెస్ నేతలు సమర్థించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆహ్వానం మేరకే ఆయన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. ఒక కార్యక్రమంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలుసుకోవడాన్ని నీటి వివాదంతో ముడిపెట్టడం సరికాదని అన్నారు. బీజేపీ, డీఎంకే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సమర్థనతో వివాదం సద్దుమణగలేదు. తమిళనాడు హక్కుల విషయంలో విజయ్ మరింత స్పష్టంగా వ్యవహరించాలన్న డిమాండ్ కొనసాగుతోంది.మేకదాటు వివాదం రాజకీయాలకే పరిమితం కాలేదు. న్యాయపరంగానూ కొనసాగుతోంది. 2018లో కావేరీ జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తమిళనాడుకు ఏటా 177.25 టీఎంసీల నీరు కేటాయించింది. 2025 నవంబర్‌లో మేకదాటు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ అనుమతిపై తమిళనాడు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిందని కాదు. 2026 జూన్‌లో కేంద్ర జల సంఘం కర్ణాటక సమర్పించిన డీపీఆర్‌ను తిరిగి పంపింది. కావేరీ జలాల కేటాయింపులకు అనుగుణంగా మార్పులు చేయాలని సూచించింది. అంటే ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా అనేక అనుమతుల ప్రక్రియలు మిగిలే ఉన్నాయి.ఈ వివాదంలో అసలైన ఆందోళన రైతులదే. కావేరీ నీరు సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతింటాయి. సాగు ఖర్చులు పెరుగుతాయి. రైతుల ఆదాయంపై ప్రభావం పడుతుంది. తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంతం వ్యవసాయానికి ఎంతో కీలకం. కర్ణాటకలోనూ తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలు నిజమైనవే అయినప్పటికీ.. నీటి పంపిణీలో ఎవరికీ అన్యాయం జరగకూడదు. నీటి చుక్క రైతుకు జీవం. రాజకీయ నాయకుడికి అది కేవలం ఎన్నికల అంశం కాకూడదు.సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారింది. ప్రజాదరణ సంపాదించడం ఒక ఎత్తు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం మరో ఎత్తు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో రాజకీయ సంబంధాలు కొనసాగించాలి. మరోవైపు కర్ణాటకతో నీటి వివాదంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతూకం పాటించడం విజయ్‌కు సవాలుగా మారింది. ముఖ్యంగా మేకదాటు విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో రాజకీయంగా ప్రభావం చూపనున్నాయి. మేకదాటు వివాదం ఇప్పుడు నీటి సమస్యను దాటి రాజకీయ పోరాటంగా మారింది. కర్ణాటక తన ప్రాజెక్టు కోసం పట్టుబడుతోంది. తమిళనాడు తన నీటి హక్కుల కోసం పోరాడుతోంది. మధ్యలో విజయ్ రాజకీయ వైఖరి చర్చనీయాంశంగా మారింది. బీజేపీ విమర్శలు. డీఎంకే, అన్నాడీఎంకే ఆరోపణలు. కాంగ్రెస్ సమర్థనతో వ్యవహారం మరింత వేడెక్కింది. రాజకీయ బంధాలు మారుతుంటాయి. కానీ రాష్ట్ర ప్రయోజనాలు శాశ్వతం. మేకదాటు విషయంలో విజయ్ మాటలకు, చేతలకు మధ్య స్పష్టత కనిపించాల్సి ఉంది. తమిళనాడు నీటి హక్కుల కోసం ఆయన ఎంత బలంగా నిలబడతారన్నదే ఈ రాజకీయ వివాదంలో కీలకంగా మారనుంది.

వంద శాతం లక్ష్యంతో జనసేన



ఒంగోలు : ఏపీలో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయం ఊపందుకుంది. నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ఇప్పటికే పొలిటికల్ పార్టీలు క్యాండిడేట్స్‌ను అనౌన్స్ చేసి క్యాంపెయిన్‌లో జోరు పెంచుతున్నాయి. ఎస్పెషల్‌గా ఫస్ట్ ఫేజ్‌లో పురపోరలో వచ్చిన ఫలితాల్లో కూటమిలో జోరు ఎక్కువగా కనిపిస్తోంది. జనసేన పార్టీ ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది.ఇప్పటికే తొలి విడతలో మంచి ఫలితాలు సాధించిన ఆ పార్టీ..రెండో విడతలోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు అభ్యర్థులను ఖరారు చేశారు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలను పరిగణనలోకి తీసుకొని క్యాండిడేట్స్‌ను సెలెక్ట్ చేసిన పవన్..కూటమిలో టీడీపీ, బీజేపీ కోఆర్డినేషన్‌పై పార్టీ నేతలకు డైరెక్షన్స్ ఇచ్చారట.ఏపీలో కూటమిలో రెండో బలమైన మిత్రపక్షంగా ఉన్న జనసేనకు పొత్తులో భాగంగా నాలుగు మేయర్ పదవులతో పాటు 21 మున్సిపల్, నగర పంచాయతీ చైర్మన్ పదవులు దక్కాయి. అయితే కొన్ని అనివార్య కారణాలు, న్యాయపరమైన ఇబ్బందులతో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగలేదు. అందులో జనసేనకు కేటాయించిన నాలిగింటిలో రెండు కార్పొరేషన్లతో 3 మున్సిపాలిటీలు ఉన్నాయి. శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి, కాకినాడ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేర్లు ఖరారు చేశారు. అలాగే రాజాం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత, భీమవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను ఎంపిక చేశారు పవన్.మ్యాప్‌లు చూడండిమొదటి దశలో జనసేన పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీల ఛైర్మన్ స్థానాలన్నింటిలో ఘన విజయం సాధించింది. పిఠాపురం, గొల్లప్రోలు, తుని, నిడదవోలు, నరసాపురం, పెడన, తిరువూరు, చిలకలూరిపేట, సాలూరు, అమలాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో జెండా ఎగరవేసింది ఆ పార్టీ. విజయవాడ, ఏలూరు మేయర్ పీఠాలను కూడా స్వాధీనం చేసుకుంది. దీంతో రెండో విడతలో కూడా సెంట్ పర్సెంట్ విజయాలను దక్కించుకోవాలని జనసేన వ్యూహ రచన చేస్తోంది.తొలి విడత ఎన్నికల్లో జనసేనకు అనుకూలమైన ఫలితాలు రావడం పార్టీ నాయకత్వంలో ఉత్సాహాన్ని పెంచింది. ఆ దశలో పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల చైర్మన్ స్థానాలను పార్టీ గెలుచుకుని ఫుల్ జోష్‌లో ఉంది. పట్టణ ప్రాంతాల్లో తమ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని జనసేన నాయకులు అంచనా వేస్తున్నారట. అయితే రెండో విడతలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. స్థానికంగా అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఓటర్ల మద్దతు ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి.కేవలం అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో టీడీపీ, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం, ప్రజలు ఆకట్టుకోవడం సవాల్‌గా చెబుతున్నారు. అయితే కాకినాడలో జనసేనకు అనుకూలంగానే ఉన్నా..20ఏళ్ల తర్వాత జరుగుతున్న సిక్కోలు కార్పొరేషన్‌లోనే ఎలాంటి సీన్ ఉండబోతుందనే చర్చ జరుగుతోంది. అక్కడ వైసీపీ టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మిని అభ్యర్థిగా పెడుతుంది. సేమ్‌టైమ్ మాజీమంత్రి ధర్మాన సిక్కోలు మేయర్ ఎన్నికలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తున్నారు. శ్రీకాకుళంలో బలమైన అనుచర వర్గం, ఫాలోయింగ్ ఉన్న గుండలక్ష్మిని పార్టీలోకి చేర్చుకొని కూటమికి సవాల్ విసురుతోంది వైసీపీ.మరోవైపు మేయర్ పీఠం ఆశించి నిరాశపడ్డ తెలుగు తమ్ముళ్లు జనసేన అభ్యర్థి విజయానికి ఎంతవరకు సహకరిస్తారన్నది కూడా బిగ్ క్వశ్చన్‌గా మారిందట. అయితే జిల్లా మంత్రులు, జనసేన కోఆర్డినేటర్లు..సిక్కోలు కార్పొరేషన్‌పై జెండా ఎగరవేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. ఈ నెల 26న జరగనున్న రెండో దశ పురపోరుకు జనసేన రాజకీయ బలానికి మరో పరీక్షగా నిలవనుందనే చర్చ జరుగుతుంది. ఫస్ట్ ఫేజ్ రిజల్ట్స్‌లాగే అదే స్ట్రైక్ రేటును కొనసాగించి రెండో దశలోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తుందా.? లేదా అన్నది.? పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పూదీ ఎవీ-జీఏ) పథకంలో ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన చికిత్సల పరిధిని భారీగా విస్తరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 23గా ఉన్న ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ఏకంగా 112కు పెంచాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని రకాల వైద్య, శస్త్రచికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి.

23 నుంచి 112కు ప్యాకేజీలు

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత వైద్య చికిత్స అందించడమే కేంద్రం లక్ష్యం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన 23 ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీలను 112కు పెంచే ప్రతిపాదనను నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) సిద్ధం చేసింది. ఇందులో కొత్తగా 89 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను చేర్చాలని గుర్తించింది. సాధారణ అనారోగ్య సమస్యల నుంచి కొన్ని కీలక శస్త్రచికిత్సల వరకు విస్తృత సేవలను ప్రభుత్వ వైద్య సంస్థల ద్వారా అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

సాధారణ వ్యాధులకు సమీపంలోనే చికిత్స

ప్రస్తుతం చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా చాలామంది రోగులు దూర ప్రాంతాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చడమే ప్రతిపాదన ప్రధాన ఉద్దేశం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని చికిత్సలు అందించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు లభించే అవకాశం ఉంటుంది.

ఏయే చికిత్సలు అందుబాటులోకి వస్తాయంటే?

ఎన్‌హెచ్ఏ గుర్తించిన ప్రతిపాదిత ప్యాకేజీల్లో పలు సాధారణ శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు ఉన్నాయి. ముఖ్యంగా హిస్టరెక్టమీ



(గర్భాశయ తొలగింపు), సున్తీ, బయాప్సీ, హైడ్రోసీల్, హెమరాయిడ్స్, సిస్టులు, లిపోమాల చికిత్సలను చేర్చాలని ప్రతిపాదించారు. అలాగే కంటి సంబంధిత సమస్యల్లో డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా స్క్రీనింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. రక్తహీనత, అధిక రక్తపోటు, బ్రాంకైటిస్, డయేరియా, రక్తవిరేచనాలు, గ్యాస్ట్రోఎంటరైటిస్, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, రీనల్ కోలిక్, తీవ్రమైన జ్వర సంబంధిత అనారోగ్యాలు, మధుమేహ సంబంధిత కొన్ని సమస్యలకు చికిత్సలు అందించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు అదనపు ఆదాయం ఈ ప్రతిపాదన వల్ల రోగులకే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ఆయుష్మాన్ భారత్ కింద అర్హులైన రోగులకు నగదు రహిత చికిత్స అందించినందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో నిధులు అందుతాయి. ఈ మొత్తాన్ని ఆస్పత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు, మందులు, ఇతర వైద్య వినియోగ వస్తువుల సమకూర్పునకు వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా అదనపు వైద్య సిబ్బంది నియామకం, ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులకు కూడా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

రాష్ట్రాల అభిప్రాయాల సేకరణ

ప్రతిపాదిత మార్పులపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించేందుకు నేషనల్ హెల్త్ అథారిటీ 2026 అక్టోబర్ 13న మెమోరాండం జారీ చేసినట్లు సమాచారం. కొత్త ప్యాకేజీల జాబితాను పరిశీలించి, తమ సూచనలు, అభిప్రాయాలను నవంబర్ 25లోపు సమర్పించాలని రాష్ట్ర ఆరోగ్య ఏజెన్సీలను కోరింది. రాష్ట్రాల నుంచి అందే సూచనలను పరిశీలించిన అనంతరం తుది విధానాన్ని ఖరారు చేయనున్నారు.

డిసెంబర్ 1 నుంచి అమలయ్యే అవకాశం

రాష్ట్రాల అభిప్రాయాలు, సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సవరించిన విధానాన్ని 2026 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి తీసుకురావచ్చని ఎన్‌హెచ్ఏ వర్గాలు వెల్లడించినట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఆధారంగా ప్యాకేజీల అమలును నిర్ణయించనున్నారు. అవసరమైతే ముందస్తు అనుమతితో రాష్ట్రాలు తమ పరిధిలోని రిజర్వ్ ప్యాకేజీల సంఖ్యను తగ్గించుకునే వెసులుబాటు కూడా కల్పించనున్నారు.

గ్రామీణ పేదలకు మరింత మేలు

ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. చిన్నచిన్న చికిత్సల కోసం జిల్లా కేంద్రాలు, నగరాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల వినియోగం పెరగడంతో వాటి సామర్థ్యం, సేవల నాణ్యత కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రతిపాదించిన ఈ విస్తరణ అమల్లోకి వస్తే ప్రభుత్వ వైద్య రంగానికి కొత్త ఊతం లభించనుంది. అయితే 112 ప్యాకేజీల పెంపు ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, తుది మార్గదర్శకాలు విడుదలైన తర్వాతే ఏయే చికిత్సలు ఎక్కడ అందుబాటులోకి వస్తాయో స్పష్టత రానుంది.

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సామాన్యుడి జీవనం భారంగా మారిందని, ధరల పెరుగుదలతో ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని విమర్శించారు. 2014లో ధరలను నియంత్రిస్తామని ఇచ్చిన హామీలకు, ప్రస్తుత పరిస్థితులకు పొంతన లేదని వ్యాఖ్యానించారు. ఆర్థిక నిర్వహణలో లోపాల భారాన్ని సామాన్య ప్రజలు ఇంకెంతకాలం భరించాలని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

కనీస అవసరాలకూ కష్టమే

ప్రధాని మోదీ పాలనలో సామాన్యులు కనీస అవసరాలు తీర్చుకోవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారని ఖర్గే ఆరోపించారు. 2014లో ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, 2026 నాటికి నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగే పరిస్థితిని తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందని, కుటుంబ బడ్జెట్లు తలకిందులవుతున్నాయని పేర్కొన్నారు. గోధుమ పిండి ధర కిలో రూ.21 నుంచి రూ.69కు, కందిపప్పు ధర రూ.75 నుంచి రూ.180కు, ఆవనూనె ధర రూ.102 నుంచి రూ.263కు పెరిగిందని ఖర్గే వెల్లడించారు. అలాగే లీటర్ పాల ధర రూ.36 నుంచి రూ.85కు, కిలో బియ్యం ధర రూ.29 నుంచి రూ.71కు చేరిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు.

దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు



అక్టోబర్ నెలలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.94 శాతానికి, టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరినట్లు ఖర్గే ప్రస్తావించారు. గతేడాదితో పోలిస్తే 61 శాతం కుటుంబాల్లో నిత్యావసర వస్తువులపై నెలవారీ ఖర్చు 20 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. మరోవైపు 74 శాతం మంది ప్రజలు అత్యవసరం కాని ఖర్చులను తగ్గించుకుంటున్నారని పేర్కొన్నారు. దేశ పురోగతిని ప్రధాని మోదీ ప్రసంగాల నిడివితో కొలవలేమని, సామాన్యుడి కంచంలో ఉన్న ఆహారం, ఖర్చుల తర్వాత జేబులో మిగిలే ఆదాయమే నిజమైన అభివృద్ధికి కొలమానమని ఖర్గే వ్యాఖ్యానించారు.

ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సైతం ధరల పెరుగుదల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించిన 6 శాతం గరిష్ఠ పరిమితిని దాటి 6.09 శాతానికి చేరిందని ఆరోపించారు. అక్టోబర్‌లో టోకు ధరల ద్రవ్యోల్బణం కూడా 12.29 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో కుటుంబాల ఆహార బడ్జెట్‌పై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీగా పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం

అక్టోబర్ నెలలో దేశ టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి పెరిగినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. సెప్టెంబర్‌లో 25.85 శాతంగా ఉన్న ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 32.84 శాతానికి చేరినట్లు తెలిపింది. ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం 8.67 శాతం నుంచి 9.24 శాతానికి పెరిగింది. అయితే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం 9.76 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 9.54 శాతానికి పరిమితమైంది.

ఇంధనం, ఆహార పదార్థాల ధరల ప్రభావం

టోకు ధరల ద్రవ్యోల్బణం పెరుగుదలకు మినరల్ ఆయిల్స్, ముడి పెట్రోలియం, సహజ వాయువు, విద్యుత్, ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాలు, రసాయనాలు, ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల ప్రధాన కారణాలుగా మంత్రిత్వ శాఖ పేర్కొంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ద్రవ్యోల్బణ గణాంకాలు తాత్కాలికమైనవని, 81.1 శాతం వెయిటెడ్ రెస్పాన్స్ రేటు ఆధారంగా వీటిని రూపొందించినట్లు వివరించింది.

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

టోక్యో: మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు భారత్, జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సరికొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో విశ్వసనీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. భారత్, జపాన్ పరస్పర సహకారాన్ని విస్తరించుకోవడానికి ఇదే సరైన సమయమని స్పష్టం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన 'రైసినా టోక్యో--2026' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

ప్రపంచ వ్యవస్థలో ఐదు కీలక మార్పులు

ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను ప్రభావితం చేస్తున్న ఐదు ప్రధాన పరిణామాలను జైశంకర్ వివరించారు. అంతర్జాతీయ వ్యవస్థకు వరుసగా ఎదురవుతున్న సంక్షోభాలు, వనరులు--సాంకేతికతను వ్యూహాత్మక ఆయుధాలుగా ఉపయోగించడం, దేశాల మధ్య పెరుగుతున్న పోటీతత్వం, ఆర్థిక నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు, విశ్వసనీయ భాగస్వామ్యాల ప్రాధాన్యం పెరగడం వంటివి ఇందులో ఉన్నాయని తెలిపారు. కొవిడ్ మహమ్మారి, ప్రధాన యుద్ధాలు, వాణిజ్య అంతరాయాలు, ఆర్థిక అస్థిరత వంటి పరిణామాలు ప్రపంచ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రపంచీకరణ ద్వారా ఏర్పడిన సరఫరా వ్యవస్థలు ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అభిప్రాయపడ్డారు.

వనరులే వ్యూహాత్మక ఆయుధాలు

ఇంధనం, సహజ వనరులు, మార్కెట్ ప్రాప్యత, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వ్యవస్థలను దేశాలు వ్యూహాత్మక సాధనాలుగా ఉపయోగిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పోటీ కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా అనేక



రంగాలకు విస్తరిస్తోందన్నారు. దేశాలు తమ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని వివరించారు.

విశ్వసనీయ భాగస్వామ్యాలకే ప్రాధాన్యం

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశాలు, వ్యాపార సంస్థలు తమ సరఫరా వ్యవస్థల్లో మార్పులు చేసుకుంటున్నాయని జైశంకర్ తెలిపారు. గతంలో తక్కువ ఖర్చు, అధిక సామర్థ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం విశ్వసనీయత, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు, భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నిబంధనలను స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించే ధోరణులను ఎదుర్కొంటూ, నిబంధనలను నిజాయితీగా పాటించే దేశాలకు నష్టం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

భారత అభివృద్ధిని గుర్తించాలి

2014 నుంచి భారత్‌లో చోటుచేసుకున్న ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిని జపాన్ గుర్తించాలని జైశంకర్ సూచించారు. భారతదేశంలో విస్తరిస్తున్న దేశీయ మార్కెట్, మెరుగుపడుతున్న మౌలిక సదుపాయాలు జపాన్ కంపెనీలకు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. తయారీ, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే జపాన్ సంస్థలకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని వివరించారు.

పలు రంగాల్లో విస్తృత సహకారానికి అవకాశం

విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం, డ్రోన్లు, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధిస్తోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో జపాన్‌తో కలిసి పనిచేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా తయారీ, సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, సమాచార సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, ఔషధ తయారీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.

రక్షణ, భద్రతా రంగాల్లో మరింత బలం

భారత్, జపాన్ మధ్య రక్షణ, భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం సమర్థవంతమైన విధానాలు, సహకార వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర విశ్వాసం భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు మార్గం సుగమం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి దోహదం

భారత్, జపాన్ మధ్య సుదీర్ఘకాలంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని జైశంకర్ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యం కేవలం ఆర్థిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా ఆసియా ప్రాంతంతోపాటు ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో భద్రతా బలగాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను భద్రతా దళాలు హతమార్చాయి. కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న చివరి స్థానిక లష్కరే తయ్యిబా ఉగ్రవాదిగా భావిస్తున్న అతడి కోసం భద్రతా సంస్థలు కొంతకాలంగా గాలిస్తున్నాయి. ఇటీవల కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు అతడి ఆచూకీని గుర్తించి మట్టుబెట్టాయి.

మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది

లతీఫ్ భట్ భద్రతా బలగాల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ మసీదులోకి ప్రవేశించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తొలుత లొంగుబాటుకు అవకాశం కల్పించారు. వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని కోరారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల విజ్ఞప్తిని అతడు తిరస్కరించడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగించాయి. చివరకు అతడిని హతమార్చాయి. ఈ ఘటనలో మసీదుకు ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

నవంబర్ 16న తప్పించుకుని.. చివరకు హతం

కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో నవంబర్ 16న భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. ఇదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం భద్రతా బలగాలు గాలింపును మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు అతడి కదలికలను గుర్తించి చుట్టుముట్టాయి.

అమిత్ షా ప్రశంసలు

ఈ ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అత్యున్నత సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశ భద్రత కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు దేశం వందనం చేస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ కూడా భద్రతా బలగాలను అభినందించారు. ఈ ఆపరేషన్ 2026లో కీలక విజయాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..

న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదికి సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌బీఏ) దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. సదరు న్యాయవాది వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను 2027 జనవరి 20కు వాయిదా వేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిటిషన్‌తో పాటు అటార్నీ జనరల్ ఇచ్చిన సమ్మతిని కూడా పరిశీలించినట్లు తెలిపింది. కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) ప్రకారం అటార్నీ జనరల్ అనుమతి లభించిన నేపథ్యంలో.. సంబంధిత న్యాయవాదిపై ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు ఎస్‌బీఏ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

కోర్టు విచారణలోనే వివాదం

సోమవారం సుప్రీంకోర్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన ధర్మాసనం విచారణకు సమావేశమైన సమయంలో ఓ న్యాయవాది తన వాదనలు అత్యవసరంగా వినాలని కోరారు. న్యాయవ్యవస్థలో అవినీతి జరుగుతోందంటూ తాను చేసిన ఆరోపణలపై కోర్టు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై నవంబర్ 2న సీజేఐ కార్యాలయానికి లేఖ పంపినా సమాధానం రాలేదని పేర్కొంటూ.. వెంటనే విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా జస్టిస్ మోహన స్పందిస్తూ.. ఇలాంటి అంశాలను ప్రస్తావించడానికి ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. అయినప్పటికీ న్యాయవాది తన వాదనను కొనసాగించారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'మేము పరిశీలిస్తాం, మీరు వేచి ఉండండి' అని సూచించారు.

సీజేఐ పదవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు

అయితే న్యాయవాది వెనక్కి తగ్గకుండా సీజేఐపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'నేను వేచి ఉండను. మీరు ఆ కుర్చీలో కూర్చోవడానికి అర్హులు కాదు. ఆ పదవికి తగిన నిజాయతీ మీకు లేదు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో కొంతసేపు కోర్టు వర్చువల్ విచారణలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం భద్రతా సిబ్బంది సదరు న్యాయవాదిని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు.

ధిక్కరణ చర్యలకు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్.. సంబంధిత న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ప్రదీప్ రాయ్ ఈ పిటిషన్ తరఫున వాదనలు వినిపించారు. న్యాయస్థానంలో ఈ తరహా ప్రవర్తన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అటార్నీ జనరల్ సమ్మతి నేపథ్యంలో ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

భారత్ వ్యతిరేక ప్రచారానికి రాహుల్‌గాంధీ నాయకత్వం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారత్ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా ఆరోపించారు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాలు భారత్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తుంటే, రాహుల్ మాత్రం విదేశీ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని బీజేపీ నేత ఆశిశ్ ఉషా అగర్వాల్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆశిశ్ ఉషా అగర్వాల్ ఎక్స్ వేదికగా విమర్శించారు. భారతదేశ ప్రగతిని దెబ్బతీయడం, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను బలహీనపరచడమే ఆయన ఉద్దేశమని ఆరోపించారు. భారత్ ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని, అయినప్పటికీ రాహుల్ విదేశీ గడ్డపై దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దేశ వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు వెల్లడించాయని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు 7 నుంచి 7.1 శాతం మధ్య ఉండవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. గోల్డ్‌మన్ శాక్స్ సైతం దేశ జీడీపీ వృద్ధిని 6.9 శాతంగా అంచనా వేసిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన రంగాల్లో భారత్ పురోగమిస్తున్న సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు చేయడం ఎందుకని ప్రశ్నించారు.

'భారతదేశపు మీర్ జాఫర్' అంటూ భాటియా విమర్శలు

అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. రాహుల్‌ను 'భారతదేశపు మీర్ జాఫర్'గా అభివర్ణిస్తూ, ఆయన వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లడాన్ని గౌరవ్ భాటియా ప్రస్తావించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు విదేశీ పర్యటనలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. విదేశీ శక్తుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికే ఆయన అక్కడికి వెళ్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో జార్జ్ సోరోస్, ఇల్హాన్ ఒమర్ వంటి వారితో రాహుల్ జరిపిన భేటీలను ప్రస్తావిస్తూ, భారత్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

ధాన్యం కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత..

రైతులకు కనీస మద్దతు ధర

- దళారుల ప్రమేయం లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చు
- రైతుల కల్లాల వద్దే ధాన్యం నాణ్యత పరిశీలన
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



తిరువూరు, మహానగర్

ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. బుధవారం తిరువూరు మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కాకర్ల రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోళ్ల ఏర్పాట్లు, సిబ్బంది విధులు, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలను సమీక్షించారు. అనంతరం రైతులతో మాట్లాడి తుఫాన్ల ప్రభావం, పంట దిగుబడి, మార్కెట్ ధరలు, కనీస మద్దతు ధర వివరాలను తెలుసుకున్నారు. తుఫాన్ల వల్ల పంట నష్టం జరగలేదని, ప్రస్తుతం ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,441, 75 కిలోల బస్తాకు రూ.1,831, గ్రేడ్-ఎ రకానికి క్వింటాల్‌కు రూ.2,461, 75 కిలోల బస్తాకు రూ.1,846 మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు. రైతులు దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. సిబ్బంది రైతుల కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం నాణ్యతను పరిశీలించి, రైతుల సమక్షంలోనే కొనుగోళ్లు చేపడతారని పేర్కొన్నారు. ధాన్యం విక్రయానికి రైతు సేవా కేంద్రంలో లేదా 7337359375 నంబర్‌కు వాట్సాప్ సందేశం పంపి ముందస్తు షెడ్యూల్ చేసుకోవచ్చని సూచించారు. విక్రయించిన ధాన్యం సొమ్మును రైతుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని తెలిపారు. రైతులు సొంతంగా గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాట్లు చేసుకుంటే నిబంధనల ప్రకారం వాటి ఖర్చులను కూడా ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చాలని, కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుల వరకు రవాణాను నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు. కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమస్యలు ఎదురైతే జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కార్యాలయంలోని 7702003571 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకొని కనీస మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో ఎ. కుమార్, తహసీల్దార్ చంద్రమౌళి, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల ప్రజా పరిషత్

అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలు

విజయవాడ, మహానగర్:

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆప్టెడ్ సభ్యుల పరోక్ష ఎన్నికలను 19వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని మండలాలకు అధ్యక్షత వహించే అధికారులను నియమించామని, వారికి సమావేశాల నిర్వహణ, అవసరమైన సభ్యుల హాజరు, నామినేషన్ల స్వీకరణ, ఓటింగ్ విధానం, రాజకీయ పార్టీల విప్ నిబంధనలు, ఫలితాల నమోదు తదితర అంశాలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చామని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు సంబంధించి ఉదయం 10 గంటలలోపు నిర్ణీత నమూనాలో, మైనారిటీ ధ్రువీకరణ పత్రంతో కూడిన నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఒక్కరే పోటీలో ఉన్నట్లయితే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.00 గంటలోపు మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులందరూ సమావేశ ప్రదేశానికి హాజరుకావాలి. వారి హాజరు నమోదు చేసిన అనంతరం తెలుగు అక్షర క్రమంలో పేర్లు పిలిచి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఒకరి కంటే ఎక్కువ



మంది పోటీలో ఉన్నట్లయితే, అవసరమైన సభ్యుల హాజరు పూర్తయిన అనంతరం అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షర క్రమంలో పిలిచి, సభ్యులు చేతులు ఎత్తడం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నిక నిర్వహిస్తారు. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిని సహనియమిత సభ్యునిగా ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఏ కారణం చేతనైనా కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నిక జరగని పక్షంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక కోసం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సంబంధిత పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశానికి హాజరవుతారు. ప్రత్యేక ఆహ్వానితులకు ముందు వరుసలో, నూతనంగా ఎన్నికైన ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు వారి రాజకీయ పార్టీల వారీగా కూర్చునే ఏర్పాట్లు చేస్తారు. అవసరమైన సభ్యుల హాజరు నిర్ధారించిన అనంతరం ఎన్నికైన ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల నుంచే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ జారీ చేసిన విప్‌కు అనుగుణంగా సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ముందుగా అధ్యక్ష పదవికి చేతులు ఎత్తే విధానంలో ఎన్నిక నిర్వహించి ఫలితాన్ని ప్రకటిస్తారు. అధ్యక్షుడి ఎన్నిక పూర్తయిన తర్వాత మాత్రమే ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించి, ఎన్నికల వివరాలను సమావేశపు నిమిషాల పుస్తకంలో నమోదు చేస్తారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశ మందిరాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, పాత్రికేయులకు వార్తా సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కోరారు.

పేపర్ లెస్‌గా ఏపీ అసెంబ్లీ

అమరావతి

ఏపీ అసెంబ్లీ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కాగిత రహితంగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఒకే దేశం ఒకే అప్లికేషన్ నినాదంతో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రూపొందించిన నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ ను ఏపీ అసెంబ్లీలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలను నేరుగా ఈ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నారు.సభలో ప్రవేశపెట్టే బిల్లులు, సభ్యులు అడిగే ప్రశ్నలు, వివిధ నోటీసులకు ఆయా శాఖల నుంచి వేగంగా, పారదర్శకంగా సమాధానాలు పంపే విధానంపై మంత్రుల వ్యక్తిగత కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నవంబర్ 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. అమరావతిలోని ఏపీ శాసనసభ కమిటీ హాల్ నంబర్ 2లో ఈ తరగతులను నిర్వహించేందుకు అసెంబ్లీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విడతల వారీగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా, నవంబర్ 18వ తేదీన ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తొలి విడత శిక్షణ జరగనుందిఈ మొదటి సెషన్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల పీఎస్‌లతో పాటు వ్యవసాయం, ఐటీ, విద్య, మైనింగ్ శాఖల మంత్రుల పీఎస్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ విధానంలో పత్రాలను ఎలా అప్‌లోడ్ చేయాలి, సభా కార్యకలాపాలను వెంటనే ఎలా సమన్వయం చేసుకోవాలి అనే అంశాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమల్లోకి రావడం వల్ల శాసనసభ సమావేశాల నిర్వహణలో కాగితాల వినియోగం పూర్తిగా తగ్గిపోవడమే కాకుండా, సమయం ఆదా అవుతుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ వద్ద ఉన్న ట్యాబ్‌లు లేదా మొబైల్ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా సభా పత్రాలను సులభంగా చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. పాలనలో పారదర్శకతను పెంచేందుకు ఈ డిజిటల్ వేదిక ఎంతగానో ఉపయోగపడనుందని అసెంబ్లీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

దోష రహిత జాబితా ప్రచురణకు ముమ్మర కసరత్తు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాపై ప్రత్యేకంగా దృష్టిసారించామని.. దోష రహిత జాబితా ప్రచురణకు ప్రణాళికాయుత కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ అన్నారు. శాసనమండలి కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాపై బుధవారం ఈసీఐ అధికారులు రాష్ట్ర సీఈవో, వివిధ జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. డిసెంబర్ 23వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురించాల్సి ఉన్నందున ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై ఈసీఐ అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందిన ఫారాలు, ఆమోదించిన ఫారాలు, పెండింగ్‌లో ఉన్న ఫారాల వివరాలు తెలియజేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ డిసెంబర్ 23న ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఆ రోజు నుంచి జనవరి 12వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ల దాఖలుకు అవకాశం ఉంటుందని, వాటిని పరిష్కరించిన అనంతరం 2027, ఫిబ్రవరి 2న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై అవగాహన కార్యక్రమాలను కూడా కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో ఎల్.చంద్రకళ, డీఐవో బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై నిరంతర పర్యవేక్షణ

డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణ బాబు



గంపలగూడెం, మహానగర్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ.శ్రావణ బాబు బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా సిబ్బంది హాజరు వివరాలు, రోగుల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి లేబొరేటరీని సందర్శించి రోజువారీగా నిర్వహిస్తున్న రక్త పరీక్షల సంఖ్య, రక్త నమూనాల సేకరణ, పరీక్షల ఫలితాలను రోగులకు సకాలంలో అందిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఔషధాల విభాగాన్ని తనిఖీ చేసి మందుల లభ్యత, రోగులకు పంపిణీ చేస్తున్న మందుల వివరాలు, మందుల నిల్వ రిజిస్టర్లు, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. కనీసం మూడు నెలలకు సరిపడా మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా వ్యాధి నిరోధక టీకాల నిల్వలు, వాటిని భద్రపరిచే విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, సంబంధిత రిజిస్టర్ల నమోదు విధానాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శృతి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాలపై పెరుగుతోన్న నీటి భారం

అమరావతి

సంస్కరణల ప్రభావంతో పట్టణ ప్రాంతాల్లో నీటి ఛార్జీల భారం క్రమంగా పెరుగుతోంది. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తే ఈ భారం మోయలేని విధంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే వాణిజ్య, గ్రూపు హౌసింగ్ కుళాయిలకు మీటర్లు పెడుతున్న ప్రభుత్వం నెమ్మదిగా అన్ని ఇళ్లకూ పెట్టనుంది. అమృత్ పథకం సంస్కరణలతోపాటు, అంతకుముందు అమలు చేసిన జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకం సంస్కరణలు కూడా ప్రజలపై భారం వేస్తున్నాయి. వాస్తవంగా యుపిఎ ప్రభుత్వ హయాంలో ఉన్న ఎన్‌యుఆర్ఎం పథకాన్నే అనంతరం అమృత్‌గా మార్చారు. పట్టణ స్థానిక సంస్థలు బలోపేతం కావాలంటూ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకాన్ని తీసుకొచ్చి కచ్చితంగా అప్పు చేయాల్సిందేనని నిబంధన పెట్టారు. ఈ రూపాల్లో తీసుకునే అప్పును తీర్చాలంటే 100 శాతం కాస్ట్ రికవరీ కింద ఖర్చు మొత్తాన్ని ప్రజల నుండే వసూలు చేయనున్నారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న నీటి ఛార్జీలు సరిపోవడం లేదని, వీటిని ఇంకా పెంచాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో నీటి ఛార్జీల డిమాండు పాత బకాయిలతో కలిపితే సుమారు రూ.800 కోట్ల వరకూ ఉంది. ఆస్తిపన్నుతో పోలిస్తే నవంబరు నెల వరకూ రూ.510.23 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీనిలో రూ.122.83 కోట్లు వసూలు చేశారు. గతేడాది ఇదే సమయానికి రూ.126.39 కోట్లు వసూలైంది. వాస్తవంగా ఇది చాలదని, మరింత పెంచాల్సి ఉంటుందని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

బిజినెస్

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ అమలెప్పుడు?



దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నిర్వహణ ఆర్థికంగా సుస్థిరంగా ఉండేలా తీసుకొస్తున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అమలుపై అనిశ్చితి కొనసాగుతోంది. ఎంపిక చేసిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ విధించేందుకు సెప్టెంబర్‌లో ప్రకటించిన విధానానికి సంబంధించి తుది అమలు తేదీని వెల్లడించాలని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లను కోరుతోంది. పండుగల సీజన్ నేపథ్యంలో వాయిదా పడిన ఈ విధానాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారనే అంశంపై చెల్లింపుల పరిశ్రమలో ఆసక్తి నెలకొంది.

ఎండీఆర్ విధానం ఏమిటి?

మర్చంట్ డిస్కౌంట్ రేట్ అంటే డిజిటల్ చెల్లింపులను స్వీకరించే వారి నుంచి చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వాములు వసూలు చేసే లావాదేవీ రుసుము. బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యూపీఐ యాప్‌ల నిర్వహణ సంస్థలకు ఈ మొత్తం ఆదాయ వనరుగా ఉంటుంది. సెప్టెంబర్ 15, 2026న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన విధానం ప్రకారం, రూ.2,000కు మించిన అర్హత కలిగిన పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 పరిమితి విధించారు.

అయితే అన్ని వ్యాపార లావాదేవీలకూ ఈ ఛార్జీలు వర్తించవు. రూ.2,000లోపు యూపీఐ చెల్లింపులకు ఎలాంటి ఎండీఆర్ ఉండదు. నెలకు రూ.లక్ష వరకు యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు సంబంధించిన పీ2పీఎం విభాగానికీ జీరో ఎండీఆర్ కొనసాగుతుంది. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి కీలక రంగాల్లో రూ.2,000కు మించిన అర్హత కలిగిన లావాదేవీలపై 0.4 శాతానికి బదులుగా స్థిరంగా రూ.5 ఛార్జీ విధించే నిబంధన ఉంది. మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీలు, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు సంబంధించిన చెల్లింపులపై 0.02 శాతం ఎండీఆర్, ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300 పరిమితి నిర్ణయించారు.

వినియోగదారులపై భారం ఉండదు

ఈ విధానంలో అత్యంత కీలకమైన అంశం సాధారణ వినియోగదారుల రక్షణ. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి జరిగే పర్సన్ టు పర్సన్(పీ2పీ) యూపీఐ లావాదేవీలన్నీ ఎప్పటిలాగే ఉచితంగానే కొనసాగుతాయి. వ్యాపారులకు చెల్లింపులు చేసే వినియోగదారుల నుంచి కూడా ఎండీఆర్ వసూలు చేయకూడదని కేంద్రం స్పష్టం చేసింది. బ్యాంకులు, వ్యాపారులు ఈ ఛార్జీని వినియోగదారులకు బదిలీ చేయకుండా చూడాలని సూచించింది. అలాగే యూపీఐ యాప్‌లు ప్లాట్‌ఫామ్ ఫీజులు లేదా ఇతర ఛార్జీలు విధించకూడదని పేర్కొంది.

మున్ముందు వడ్డింపులే..

వడ్డీరేట్లు కనీసం 50-75 బేసిస్ పాయింట్లు పెంచనున్న ఆర్బీఐ!

ఇక ఆర్బీఐ కఠిన ద్రవ్య సమీక్షలే

వడ్డీరేట్లు కనీసం 50-75 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం

6.25 శాతానికి రెపోరేటు చేరవచ్చన్న అంచనాలు



ముంబై : వడ్డీరేట్లు పెరుగనున్నాయా? రాబోయే ద్రవ్య సమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రెపోరేటును మరింతగా పెంచబోతున్నదా? అంటే.. అవుననే సమాధానాలే నిపిస్తున్నాయిప్పుడు. భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, స్థిరత్వం లోపించిన ముడి చమురు ధరలు, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం.. కీలక వడ్డీరేట్లను ఎగదోసేలా ఉంటున్నాయి మరి. ఈ క్రమంలోనే దాదాపు రెండేండ్ల కింద కనిపించిన స్థాయికి మళ్లీ వడ్డీరేట్లు చేరుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 5.5 శాతంగా ఉన్న రెపోరేటును రానున్న నెలల్లో మరో 50 నుంచి 75 బేసిస్ పాయింట్లు పెంచి 6.25 శాతానికి ఆర్బీఐ తీసుకెళ్లవచ్చని మెజారిటీ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, కీలక రంగాల నిపుణులు అంచనా వేస్తున్నారు. బ్యారెల్ ముడి చమురు ధర ఇంకా 100 డాలర్ల దరిదాపుల్లో ఉండటం, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలహీనపడుతుండటం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నాయి.

ద్రవ్యోల్బణం పరుగో.. పరుగు

అధికారిక గణాంకాల ప్రకారం అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం రెండేండ్ల గరిష్ఠానికి చేరి ఆర్బీఐ నిర్దేశించిన 6 శాతం పరిమితిని దాటింది. గత నెల వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతంగా, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 12.29 శాతానికి ఎగిశాయి. దీంతో ఆర్బీఐ మరింత కఠిన ద్రవ్య విధానాన్నే అనుసరిస్తుందన్న వాదన బలపడింది. దాదాపు నాలుగేండ్ల తర్వాత అక్టోబర్ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ తొలిసారి రెపోరేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిసెంబర్ సమీక్షలోనూ పావు శాతం పెంపు ఉంటుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

ఆటో, రియల్టీకి దెబ్బ

ద్రవ్యోల్బణం కట్టడికి వచ్చే ద్రవ్య సమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ పెంచడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఇదే జరిగితే నిర్మాణ, ఆటో రంగాలకు పెద్ద దెబ్బేనన్న విశ్లేషణలుంటు న్నాయి. ఇప్పటికే ఇండ్ల విక్రయాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఈ క్రమంలో వడ్డీరేట్ల పెంపు గృహ రుణాలపై ప్రభావం చూపనున్నది. ఇప్పటికే లోన్లపై ఇండ్లు కొన్నవారికి ఈఎంఐలు భారంగా మారుతాయని, కొనాలనుకుంటున్నవారు తమ నిర్ణయాలను వాయిదా వేసుకోవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అలాగే వాహన, వ్యక్తిగత రుణాలూ ప్రియమవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. నిర్మాణ, ఆటో వాటి అనుబంధ రంగాలు మందగమనంలోకి జారుకుంటే.. అది దేశ ఆర్థిక వృద్ధిరేటునే కుంగదీస్తుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలే ఎల్ నినో దెబ్బకు అన్ని రంగాలు ఢీలాపడ్డ తరుణంలో ద్రవ్యోల్బణం పేరిట ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే మరిన్ని రంగాలు నష్టపోతాయని సూచిస్తున్నారు. ఇంధనం, ఆహార ధరల షాక్‌లు రెండూ ఒకేసారి వచ్చినప్పుడు వాటి ప్రభావం మరింత పెద్దదిగా ఉండవచ్చు. అందుకే పరిస్థితుల్ని చక్కదిద్దడానికి ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నది. వచ్చే నెల ద్రవ్య సమీక్షలో రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలు లేకపోలేదు.

సుకన్య సమృద్ధి యోజన: నెలకు రూ.12,500 కడితే కూతురి ఖాతాలో రూ.70 లక్షలు!

ఆడపిల్ల పుట్టిన క్షణం నుంచే తల్లిదండ్రుల ఆలోచనలు ఆమె భవిష్యత్తు చుట్టూనే తిరుగుతుంటాయి. పెరిగిపోతున్న ఉన్నత చదువుల ఖర్చులు, వివాహం, ఇతర జీవిత అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలికంగా నిధులు సమకూర్చు కోవడం నేడు ప్రతి కుటుంబానికీ సవాలుగా మారింది. సురక్షితమైన రాబడులతో పాటు ప్రభుత్వ హామీ, ఆకర్షణీయమైన వడ్డీ, పన్ను మినహాయింపులు అందించే పథకాల వైపు నేటితరం మొగ్గు చూపుతోంది. ఇందులో ప్రధానంగా నిలుస్తున్న పథకమే 'సుకన్య సమృద్ధి యోజన'. నిర్దిష్ట కాలవ్యవధిలో స్థిరమైన పొదుపు ద్వారా భారీ మూలధనాన్ని ఎలా సమకూర్చుకోవచ్చో, అసలు ఈ పథకం ద్వారా రూ.50 లక్షలు, రూ.75 లక్షలు లేదా రూ.1 కోటి వరకు నిధిని పొందడం సాధ్యమేనా అనే అంశాలను చూద్దాం..

పథకం నిబంధనలు, గడువు వివరాలు

ఆడపిల్లకు పదేళ్ల వయస్సు వచ్చేలోపు ఎప్పుడైనా తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు సుకన్య సమృద్ధి ఖాతాను ప్రారంభించవచ్చు. ఈ పథకం కింద గరిష్ఠంగా 15 సంవత్సరాల పాటు మాత్రమే డిపాజిట్లు చేయాల్సి ఉంటుంది. అయితే ఖాతా మాత్రం 21 ఏళ్ల తర్వాత మెచ్యూర్ అవుతుంది. 15 ఏళ్ల పాటు డబ్బు జమ చేయడం ఆగిపోయిన తర్వాత కూడా, మిగిలిన ఆరేళ్ల కాలానికి ఖాతాలోని మొత్తం బ్యాలెన్స్‌పై నిరంతరం వడ్డీ జమ అవుతూనే ఉంటుంది. ఈ దీర్ఘకాలిక కాంపౌండింగ్ ప్రయోజనమే పెట్టుబడిని రెట్టింపు కంటే ఎక్కువగా పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే పాప ఉన్నత చదువుల కోసం ఆమెకు 18 ఏళ్లు నిండిన తర్వాత (లేదా 10వ తరగతి పూర్తయ్యాక) ఖాతాలోని బ్యాలెన్స్ నుంచి 50 శాతం వరకు ముందస్తుగా ఉపసంహరిం చుకునే (విత్‌డ్రా) వెసులుబాటు కూడా ఉంటుంది.



గరిష్ఠంగా ఎంత నిధిని నిర్మించవచ్చు?

సుకన్య సమృద్ధి పథకంలో ఒక ఆర్థిక సంవత్సరానికి గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు మాత్రమే డిపాజిట్ చేయడానికి అనుమతి ఉంది. ఒకవేళ ఏటా గరిష్ఠ పరిమితి అయిన రూ. 1.5 లక్షలను వరుసగా 15 ఏళ్ల పాటు క్రమం తప్పకుండా జమ చేస్తే, 8.2 శాతం వడ్డీ రేటు ప్రకారం 21 ఏళ్ల మెచ్యూరిటీ సమయానికి దాదాపు రూ.70 లక్షల వరకు భారీ నిధి సమకూరుతుంది. విశేషమేమిటంటే, ఈ కాలవ్యవధిలో లభించే వడ్డీ ఆదాయమే తల్లిదండ్రులు పెట్టిన అసలు పెట్టుబడి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

లక్ష్యం ఆధారిత నెలవారీ పొదుపు ఎంత ఉండాలి?

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుగానే ఒక నిర్దిష్ట నిధిని లక్ష్యంగా పెట్టుకుని పొదుపు చేయాలనుకుంటే, ప్రస్తుత రాబడుల ఆధారంగా నెలవారీ పెట్టుబడులను ఇలా ప్లాన్ చేసుకోవచ్చు:

రూ.10 లక్షల కోసం: నెలకు సుమారు రూ. 1,800 చొప్పున డిపాజిట్ చేయాలి.

రూ.25 లక్షల కోసం: నెలకు సుమారు రూ. 4,500 వరకు పొదుపు చేయాల్సి ఉంటుంది.

రూ.50 లక్షల కోసం: నెలకు దాదాపు రూ. 9,000 చొప్పున క్రమం తప్పకుండా జమ చేయాలి.

రూ.70 లక్షల కోసం: నెలకు దాదాపు రూ.12,500 చొప్పున క్రమం తప్పకుండా జమ చేయాలి.

రూ.1 కోటి నిధి సాధ్యమేనా?

సుకన్య సమృద్ధి పథకం ద్వారా మాత్రమే ఒంటరిగా రూ.1 కోటి నిధిని సాధించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఈ పథకంలో ఏడాదికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల సీలింగ్ పరిమితి ఉంది. ప్రస్తుత వడ్డీ రేట్లతో గరిష్ఠ మొత్తాన్ని 15 ఏళ్ల పాటు జమ చేసినప్పటికీ, 21 ఏళ్లకు వచ్చే మెచ్యూరిటీ మొత్తం కోటి రూపాయల కంటే దిగువనే ఆగిపోతుంది. రూ.1 కోటి అంతకంటే ఎక్కువ నిధిని లక్ష్యంగా పెట్టుకున్నవారు సుకన్య సమృద్ధితో పాటు ఇతర దీర్ఘకాలిక పెట్టుబడి మార్గాలను కూడా ఎంచుకోవాల్సి ఉంటుంది.

స్పోర్ట్స్

పాకిస్థాన్‌పై భారత్ సంచలన విజయం

చివర్లో పాక్ ఆటగాళ్ల ఊహించని పనితో నెటిజన్లు ఫిదా



సాఫ్ ఛాంపియన్‌షిప్ 2026 ఫైనల్ పోరు ముగిసిన తర్వాత మైదానంలో ఇరు జట్లు ప్రదర్శించిన అద్భుత క్రీడాస్ఫూర్తి క్రీడాభిమానుల హృదయాలను గెలుచుకుంది. టైటిల్ చేజారిన బాధలో ఉన్న పాకిస్థాన్ ఆటగాళ్లను భారత జట్టు ఓదార్చగా, పాక్ జట్టు ఊహించని రీతిలో స్పందించి అందరినీ ఆశ్చర్య పరిచింది. విజేతగా నిలిచిన భారత ఆటగాళ్లకు మైదానంలో వరుసగా నిలబడి 'గార్డ్ ఆఫ్ ఆనర్' ఇచ్చి తమ ఉన్నత వ్యక్తిత్వాన్ని చాటుకుంది. న్యూకాసిల్ యునైటెడ్ మాజీ మిడ్‌ఫీల్డర్ నొల్బెర్టో సొలానో కోచింగ్‌లో తొలిసారి ఫైనల్ చేరిన పాకిస్థాన్ జట్టు ఇచ్చిన ఈ గౌరవాన్ని టీమిండియా ఆటగాళ్లు మనస్ఫూర్తిగా స్వీకరించారు. ప్రత్యర్థి ఆటగాళ్లతో కరచాలనం చేస్తూ ఆత్మీయంగా స్పందించారు. ఈ అపురూప దృశ్యాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఢాకాలోని నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ తుది సమరంలో భారత్ 2-1 గోల్స్ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి రికార్డు స్థాయిలో పదోసారి సాఫ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తొలి అర్ధభాగంలో ఆలంగీర్ ఘాజీ గోల్‌తో పాక్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో అర్ధభాగంలో బ్రిసన్ ఫెర్నాండెజ్‌పై దురుసు ప్రవర్తన కారణంగా పాక్ ఆటగాడు జునైద్ షా రెడ్ కార్డుతో మైదానం వీడాడు. ఆ వెంటనే భారత్ తరఫున సుహైల్ అహ్మద్ భట్ గోల్ చేసి స్కోరును సమం చేశాడు. సుహైల్ టోర్నీలో నాలుగు గోల్స్ చేసి గోల్డెన్ బూట్, బెస్ట్ ప్లేయర్ అవార్డులు సాధించాడు. ఆట ముగియడానికి రెండు నిమిషాలు ఉందనగా 88వ నిమిషంలో సందీప్ మండి హెడ్డర్ గోల్‌తో భారత్ విజయాన్ని ఖాయం చేసింది. వరుసగా మూడుసార్లు సాఫ్ ట్రోఫీని కైవసం చేసుకుని భారత్ సరికొత్త చరిత్ర లిఖించింది.

పృథ్వీ షా అట్టర్ ప్లాప్.. అయినా జట్టు సంచలన విజయం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2026లో మహారాష్ట్ర ఎట్టకేలకు బోణీ కొట్టింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఎలైట్ గ్రూప్-సి మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో మహారాష్ట్ర విజయం సాధించింది. చివరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన ఈ పోరులో ఆఖరి బంతికి మహారాష్ట్ర గట్టెక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హిమాచల్ ప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. ఓపెనర్ ఏకాంత్ సేన్ (73 నాటౌట్; 55 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. మహారాష్ట్ర బౌలర్లలో విక్కీ ఓస్త్వాల్ (2/15), వివేక్ షెలార్ (2/32) తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 146 పరుగుల లక్ష్య ఛేదనలో మహారాష్ట్రకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్లోనే ఓపెనర్లు అర్షిన్ కులకర్ణి (0), కెప్టెన్ పృథ్వీ షా (1) వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. ఈ సమయంలో సాహిల్ పరాఖ్ (35; 25 బంతుల్లో 6 ఫోర్లు), రుషికేశ్ సోనావనే (42; 33 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 75 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే వీరిద్దరూ ఔటయ్యాక హిమాచల్ బౌలర్ రోహిత్ కుమార్ (4/22) ధాటికి మహారాష్ట్ర వరుస వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. చివరి ఓవర్లో మహారాష్ట్ర విజయానికి 11 పరుగులు అవసరం కాగా.. ఆల్‌రౌండర్ విక్కీ ఓస్త్వాల్ (25 నాటౌట్; 18 బంతుల్లో 4 ఫోర్లు) మూడు బౌండరీలు బాది జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.



ధోనీ రిటైర్మెంట్‌పై రోహిత్ శర్మ భావోద్వేగ పోస్ట్

ఐపీఎల్ ప్లేయర్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన ఎంఎస్ ధోనీ

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు 2027 సీజన్ నుంచి మెంటార్‌గా వ్యవహరించనున్న ధోనీ

ధోనీతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న రోహిత్ శర్మ



భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఐపీఎల్ కు గుడ్ బై చెప్పాడు. అయితే, ప్లేయర్‌గా మైదానాన్ని వీడినప్పటికీ, సీఎస్‌కేతో అతడి ప్రయాణం మరో రూపంలో కొనసాగనుంది. 2027 ఐపీఎల్ సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 'టీమ్ మెంటార్'గా ధోనీ సరికొత్త బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐపీఎల్ రిటెన్షన్ ప్రక్రియకు ముందు, తనను ప్లేయర్ కాంట్రాక్ట్ నుంచి రిలీజ్ చేయాలని ధోనీ స్వయంగా కోరడంతో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ధోనీ నిర్ణయంపై భారత క్రికెటర్ రోహిత్ శర్మ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ శుభాకాంక్షలు తెలిపాడు. "అద్భుతమైన ఐపీఎల్ ప్రయాణం సాగించిన ధోనీ భాయ్‌కి అభినందనలు. నీతో కలిసి మైదానంలో, వెలుపల పంచుకున్న జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. నీపై ఉండే గౌరవం ఎప్పటికీ తగ్గదు" అంటూ రోహిత్ పేర్కొన్నాడు. మరోవైపు, సీఎస్‌కే అధినేత ఎన్. శ్రీనివాసన్ స్పందిస్తూ... ధోనీ లేని చెన్నై సూపర్ కింగ్స్‌ను ఊహించలేమని, ఇది ఎప్పటికీ అతడి ఇల్లేనని స్పష్టం చేశారు. జట్టు పరివర్తన దశలో ఉన్న తరుణంలో తర్వాతి తరం ఆటగాళ్లను తీర్చిదిద్దేందుకు ధోనీ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని సీఎస్‌కే సహ యజమాని రూపా గురునాథ్ పేర్కొన్నారు.

మహానగర్



ఆకట్టుకునేలా 'హరిహర పుత్ర' టీజర్

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర' బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆదుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో.. చూపు తిప్పుకోలేరు!

వయ్యారాలు ఒలకబోస్తున్న రకుల్.. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ



విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా దుల్కర్ సల్మాన్!

ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.



తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్.. మసూద మూవీకి నాలుగేళ్లు

టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద' సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయపెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, శుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999